కథ

# హేపీ బర్త్ డే!

వాణిశ్రీ

కిరణ్మయి ఆఫీసుకి వెళ్ళడానికి రెడీ అవుతోంది. ఇంతలో సెల్ రింగైంది.

'ఈ టైమ్‌లో హారిక కాల్ ఏమిటి?' అనుకుంటూ "హాయ్! హారికా! గుడ్‌మాణింగ్" అన్నది కిరణ్మయి.

"హాయ్ కిరణ్. నీకో సర్‌ప్రైజ్. నీ రూమ్‌కి వస్తున్నా! ఆఫీసుకి దుమ్మాకొట్టెయ్" అన్నది హారిక.

"నో..నో! చేరింది కొత్తగా! మేనేజర్ చండ ప్రచండు డని చెప్పుకుంటారు. ఒకరోజు ముందుగా చెప్పి లీవు పెడితేనే శాంక్షన్ చేస్తాడు, లేకపోతే సీరియస్!"

"అట్లాంటి చండ ప్రచండుల్ని గురించి విన్నాలే. హఠాత్తుగా వాంతులు, విరోచనాలు, కడుపు నెప్పి పట్టుకుంటే ఏం చేస్తావేం?"

"అది వేరు"

"ఇదీ వేరే. నోర్మూసుకుని రూమ్‌లో వుండు" అని హారిక కట్ చేసింది.

హారిక తెచ్చే సర్‌ప్రైజ్ న్యూస్ ఏమిటో అర్థంకాక ఆలోచిస్తూ కూర్చుంది కిరణ్మయి.

పది నిముషాల్లో హారిక స్కూటీ చప్పుడు వినిపించింది. సుడిగాలిలా లోపలకు వచ్చేసింది హారిక.

"ఏంటే సర్‌ప్రైజ్ న్యూస్. నీకేమైనా పెళ్ళికుదిరిందా?" అడిగింది కిరణ్మయి.

"నీకెప్పుడూ పెళ్ళి కబుర్లేనే. ఈరోజు డేట్ ఎంత చెప్పు?"

"జూలై ట్వంటీ సెవన్"

"ఈరోజు నా బర్త్‌డే" అని పక పకా నవ్వింది.

"మెనీ మెనీ హేపీ రిటన్స్ ఆఫ్ ద డే!" చెయ్యికలిపి హారికను హత్తుకుని శుభాకాంక్షలు తెలిపింది.

"అందుకే. నీకు గ్రాండ్ పార్టీ అరేంజ్ చేశాను. ఈరోజే చిరంజీవి మూవీ రిలీజ్. మార్నింగ్ షోకి టిక్కెట్స్ సంపాదించాను. ఆ తర్వాత బిర్యానీ సెంటర్‌లో లంచ్" చెప్పింది హారిక.

"అంతా బానే వుందిగానీ మా మేనేజర్‌తో మాట్లాడ్డమే ప్రాబ్లమే! కోడిగుడ్డు మీద ఈకలు పీకే రకం"

"సరే! నెంబర్ చెప్పు. నేనే మాట్లాడతా!" అన్నది హారిక.

కిరణ్మయి నెంబర్ చెప్పింది.

"సార్! నేను కిరణ్మయి ఫ్రెండ్ హారికను మాట్లాడుతున్నా. కిరణ్మయికి తెల్లవారుజాము నుంచి వాంతులు, విరోచనాలు సార్! కడుపునెప్పని ఒకటే బాధపడుతున్నది. ఈరోజు లీవు మార్క్ చెయ్యండి సార్!" గడగడా పాఠంలా అప్పజెప్పింది హారిక.

"అయ్యయ్యో! అసలే సీజన్ బాగోలేదమ్మా! ఈ కాలంలో బైట తిళ్ళు ఏమీ తినకూడదు. ఫుడ్ పాయిజన్ అవుతుంది. కానీ పాపం ఏం చేస్తారు? ఒంటరిగా వుంటున్నారు. మీకేమో వండుకోవడం చాతగాదు. హోటళ్ళల్లో తినక తప్పదు" మేనేజర్ క్లాస్ పీకుతుంటే హారిక బలవంతంగా నవ్వు ఆపుకుంది.

మేనేజర్ చాలా చాలా జాగ్రత్తలు చెప్పాడు.

"పాపం, మీ మేనేజర్ నమ్మేశాడే. మంచివాడులాగే వున్నాడు. ఎన్ని జాగ్రత్తలు చెప్పాడనుకున్నావ్?" అని పక పకా నవ్వింది హారిక.

కిరణ్మయి హాయిగా నిట్టూర్చింది.

"మార్నింగ్ షో ఎన్నింటికే?"

"లెవన్ థర్టీకి. మనకి టికెట్లు రిజర్వ్ అయిపోయాయి కాబట్టి పావుగంట ముందు వెళ్తే చాలు" అన్నది హారిక.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. పదకొండు దాటింది. ఇక బయల్దేరదామనుకుంటూ వుండగా బొంయ్..బొంయ్‌మని సైరన్ వినిపించింది. కిటికీలో నుంచి తొంగి చూస్తే ఇంటిముందు అంబులెన్స్ ఆగివుంది. ఇంటి ఓనర్స్ ఫ్యామిలీ మెంబర్స్‌లో ఎవరికైనా సీరియస్ అయిందేమో? హార్ట్ ఎటాక్ వచ్చిందేమో అనుకుంది కిరణ్మయి. అంబులెన్స్‌లో నుంచి భారీకాయం తారుడబ్బా రంగులో దిగుతుంటే ఆవిడ ముఖం ఎక్కడో చూసినట్లుగా అనిపించింది. అనిపించడం ఏమిటి ఖర్మ? ఆవిడ ఆఫీసులో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మరియమ్మే. ఇప్పుడు తనకే హార్ట్‌బీట్ పెరిగింది. "మరియమ్మ అంబులెన్స్‌తో సహా ఎందుకొచ్చినట్లు?" అన్నది కిరణ్మయి కంగారుపడుతూ.

"మరియమ్మ ఎవరే...?" అని హారిక అడుగుతూ వుండే లోపలే తలుపు దబదబ చప్పుడైంది.

కిరణ్మయి గుండె ఆగినట్లయింది. మరియమ్మ వచ్చింది తనకోసమే. హారిక ఫోన్ చేస్తే మేనేజర్ ఎన్నో జాగ్రత్తలు చెప్పాడంటే ఏమో అనుకుంది. మరీ ఇంటికి అంబులెన్స్ పంపించేంత ఘోరమైన మంచివాడని అర్థమయ్యేసరికి కిరణ్మయికి పైపైనే పోయాయి ప్రాణాలు.

"ఇప్పుడేం చేయాలే ఖర్మ. చెప్పి చావు. మా మేనేజర్ అంబులెన్స్ పంపించాడు" అంది కిరణ్మయి వణికిపోతూ.

హారికకు పరిస్థితి అర్థమైంది. కథ అడ్డం తిరిగిందన్న మాట.

"ఓరి త్రాష్టుడా? నికృష్టుడా? ఎంత పని చేశావు? అంబులెన్స్ ఎవడు పంపమన్నాడు నిన్ను? ఇప్పుడేది గతి? ఒకవైపు సినిమాకి టైమైపోతున్నది" అనుకుంటూ డీలాపడిపోయింది హారిక.

తలుపు దబదబ బాదేస్తోంది మరియమ్మ. తలుపు తియ్యకపోతే వూడిపోయేట్టుంది.

"చేసేదేముంది? బెడ్‌మీద దుప్పటి కప్పుకుని పడుకో. మీ మరియమ్మని ఎలాగో మేనేజ్ చేస్తా" అన్నది హారిక.

కిరణ్మయి బెడ్‌మీద పడుకుని ముఖం కూడా కనిపించకుండా ముసుగుతన్ని పడుకుంది.

హారిక బోల్టు తీసేసరికి విసురుగా లోపలికొచ్చిపడింది మరియమ్మ.

"కిరణమ్మగారేదమ్మా? పాపం వాంతులు, విరోచనాలంటగా, వూరంతా అవే. హాస్పటల్స్‌లో జనం నిండిపోయి బెడ్లు దొరక్క వరండాల్లో చచ్చిన శవాల్లా పడుకున్నారు. నిన్ననే నూటముప్పైమంది చచ్చిపోయారంట. ఏం రోగాలో పాడో" అంటూ రూమంతా కలయజూసింది మరియమ్మ.

"అదుగో పడుకుంది. ఏమవుతుందోఏమో?" అని ఏడుపుముఖం పెట్టింది హారిక.

"వెంటనే హాస్పటల్లో జేర్పించాలి? మేనేజర్ సార్‌కి ఎంత ముందు చూపో? కిరణమ్మకి ఇట్లా అని తెలియగానే కంగారుపడిపోయి హాస్పటల్‌కి ఫోన్ కొట్టి అంబులెన్స్ పిలిపించి నన్నెక్కించాడు" అని బెడ్‌వైపు వెళ్ళి దుప్పటి లాగేసింది.

బెడ్‌మీద కిరణ్మయికి ముచ్చెమటలు పోసి నిజంగానే జబ్బుమనిషిలా మారిపోయింది.

"మరియమ్మా! ఏం ఫరవాలేదు. డాక్టర్‌గారొచ్చారు. మందులు ఇచ్చార్లే. నేను క్లోజ్ ఫ్రెండ్‌ని. దగ్గరుండి చూసుకుంటాలే. కంగారేం లేదని మేనేజర్‌సార్‌కి చెప్పు" అన్నది హారిక.

మరియమ్మ హారిక వైపు పురుగుని చూసినట్లు అసహ్యంగా ముఖం పెట్టి "చిన్నపిల్లవు నీకేం తెలుసు? వాంతులు, విరోచనాలు ఎంత డేంజరో? కిరణమ్మని హాస్పటల్లో చేర్పించేసి వెళ్ళకపోతే మేనేజర్ సార్ నా పీక పట్టుకుంటారు. తల్లి, తండ్రి దగ్గర లేరుగదా? మనవే చూసుకోవాలి? ఏదైనా ఐతే? ఎవడిది బాధ్యత. నీకేవమ్మా ఎన్నయినా కబుర్లు చెప్తావు" అని కిరణ్మయిని ఎత్తి భుజం మీద వేసుకుని అంబులెన్స్‌లో ఎక్కించేసింది.

హారికకు ఫాలో అవక వేరే దారి కనిపించలేదు. రూమ్‌కి తాళం వేసి అంబులెన్స్‌లో ఎక్కి కిరణ్మయి పక్కన కూర్చుంది. కిరణ్మయి ఇప్పుడో ఇంకాసేపటికో చావబోతున్న దానిలా అయోమయంగా చూస్తోంది.

హేపీగా జరుపుకోవాలనుకున్న బర్త్‌డే ఇలా అన్‌హేపీగా మారిపోవడానికి కారణం ఏమిటో? హారికకు ఏమీ అర్థం కాలేదు. అసలు తను ఓవర్ కాన్ఫిడెన్స్‌తో యాక్ట్

చేసిందేమో? అనవసరంగా మేనేజర్‌కి ఫోన్ చేసిందేమో? ఈరోజు ఆఫీసుకి దుమ్మాకొట్టి రేపెళ్ళి ఏదో కుంటిసాకు చెప్పమంటే సరిపోయేదేమో? ఛ..ఛ..అంతా నాశనం. ఎంత కష్టపడి రిలీజ్ రోజే సినిమా టిక్కెట్లు సంపాదించింది? చూసే యోగం లేకుండాపోయింది.

పోనీ సినిమా టిక్కెట్లు మరియమ్మకిచ్చి బ్లాకులో అమ్ముకుని రమ్మని అడిగితే? అమ్మో! పీక పిసికి చంపేస్తుంది.

అంబులెన్స్ లైఫ్ సేవర్ కార్పొరేట్ హాస్పటల్ ముందు ఆగింది. కిరణ్మయిని స్ట్రెచర్ మీద ఎక్కించేసి వాయువేగంతో తోసుకుంటూ ఐ.సి.యులో బెడ్ మీద పడుకోబెట్టారు. డాక్టర్ వచ్చి పల్స్, బి.పి చూసి కేస్ షీట్ మీద ఏదో కెలికాడు.

వార్డ్‌బోయ్ హారికను పిలుచుకెళ్ళి రిజిస్టర్‌లో కిరణ్మయి పేరు, వయసు, అడ్రసు వగైరా వివరాలన్నీ రాయించి వెంటనే పదివేలు క్యాష్ కౌంటర్లో చెల్లించి రిసీట్ నెంబర్ చెప్పమన్నాడు. హారిక దగ్గర అంత డబ్బు లేదు. బైటకు పరిగెత్తి ఏ.టి.యమ్ ఎక్కడుందో ఎంక్వయిరీ చేసింది. డబ్బు డ్రా చేసి క్యాష్ కౌంటర్లో కట్టి వూపిరి పీల్చుకుంది.

కిరణ్మయికి ఇంజక్షన్ అంటే చచ్చేంత భయం. నర్స్ ముంజేతికి సూది గుచ్చేసరికి కెవ్వున కేక పెట్టింది. ఐ.సి.యు వార్డులో పేషెంట్లు భయంతో లేచి కూర్చున్నారు.


“హడలి చచ్చా కదమ్మా? ఇక ఆపరేషన్ చేస్తే ఏం తట్టుకుంటావు?” అన్నది నర్స్.

“ఆపరేషన్ చెయ్యకుండా ఎట్లాగమ్మా? జబ్బులెట్లా తగ్గుతాయి”

“నాకేం జబ్బులేదు” అని లేవబోయిన కిరణ్మయిని ఒక్కతోపు తోసింది నర్స్.

“పడుకోవమ్మా! చూస్తే చదువుకున్న దానిలా వున్నావు? జబ్బు సంగతి నీకేం తెలుస్తుంది? ఎవరికాళ్ళకి తెలిసేమాటైతే ఇంకా మేమెందుకు? మా డాక్టర్లు, హాస్పటల్ ఎందుకు? అట్టే కదలకు. చూడు నరం దొరకడం లేదు” అని నాలుగైదు చోట్ల పొడిచి పొడిచి చివరకు ఒక చోట నీడిల్ సెటిల్ చేసి టేప్ చుట్టి సెలైన్ బాటిల్‌కి కనెక్షన్ ఇచ్చింది నర్స్.

ఐ.సి.యు.లో ఏ.సి చల్లటి వాతావరణానికి కళ్ళుమూతలు పడిపోయాయి. నిద్రముంచుకొచ్చింది కిరణ్మయికి.



మెలకువ వచ్చేసరికి చుట్టూ డాక్టర్లు, నర్సుల బృందం తెల్లటి డ్రెస్సుల్లో నిలబడి వుండేసరికి కిరణ్మయికి భయం వేసి ముచ్చెమటలు పట్టాయి. ఏమైంది తనకి? తన చుట్టూ ఇంతమంది నిల్చున్నారెందుకూ? తను బతికే వుందా? లేక చచ్చిపోయిందా? వీళ్ళంతా నిజం డాక్టర్లా? దెయ్యాలా?

“సెలైన్ బాటిల్స్ ఎక్కించాం. కాబట్టి కొంచెం కోలుకుంది”

“భూమ్మీద ఇంకా నూకలున్నాయి ఈ పిల్లకి”

“మన హాస్పటల్‌కి తీసుకు రాబట్టి సరిపోయింది. లేకపోతే ఈపాటికి టపాకట్టి వుండేది”

కిరణ్మయికి నోట మాటలు రావడం లేదు. భయంతో కళ్ళు తిప్పుతూ వుంది.

“బాడీ స్కానింగ్, ఎండోస్కోపీ, టెస్టులన్నీ చేయించండి” అని డాక్టర్ కేసు షీట్ మీద బర బరా గీకిపారేసి కదిలాడు.

బాడీ స్కానింగో, సిటీ స్కానింగో అని గుహలాంటి దాంట్లోకి పంపిస్తుంటే వూపిరి ఆగిపోయినట్లయింది.

తర్వాత కడుపులోకి నోటి ద్వారా గొట్టం పంపిస్తుంటే నిజంగానే వాంతి వచ్చింది.

నాలుగ్గంటలకి టెస్టులన్నీ పూర్తయ్యాయి. కిరణ్మయికి ఆకలితో కడుపు మండిపోతోంది.

హారిక చిన్న పొట్లంలో పెరుగన్నం తెచ్చింది.

“ఇదేంటే? ఇదేం సరిపోతుంది. ఆకలి దంచేస్తోంది. ఫుల్‌మీల్స్ కూడా చాలదు” అని కేకలు పెట్టింది కిరణ్మయి.

“పెరుగన్నం తప్ప ఏం పెట్టొద్దని వార్నింగ్ ఇచ్చాడు డాక్టర్” అన్నది హారిక.

“ఇదంతా నీ మూలానే. నీ పుట్టిన రోజు నా చావుకొచ్చింది” అంది కిరణ్మయి నిష్ఠూరంగా.

హారిక ఏడవలేక నవ్వింది.

సాయంకాలానికి కిరణ్మయి తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ వచ్చారు.

“నీకిలా అయిందని మీ మేనేజర్ ఫోన్ చేసి చెప్పాడు. బస్సు లేటవుతుందని టాక్సీలో వచ్చాం” అన్నాడు తండ్రి.

“నీకీ హోటల్ తిండి పడదమ్మా అని చెప్తే విన్నావు కాదు. ఉద్యోగం వద్దు, సద్యోగం వద్దు పద మన వూరుపోదాం” కళ్ళు తుడుచుకుంటూ అన్నది తల్లి.

హారిక నవ్వు ఆపుకోలేక అక్కడ్నుంచి తప్పుకుంది.

మర్నాడు ఉదయానికి హాస్పటల్ వారు కిరణ్మయికి అన్నీ ఆల్‌రైట్ అని సర్టిఫికెట్ ఇచ్చేసి పాతికవేలు బిల్లు చేతికిచ్చారు.

బతుకు జీవుడా అని డిశ్చార్జి చేయించుకుని రూమ్ చేరుకుంది. రెండురోజుల తర్వాత కిరణ్మయి బలవంతంగా తల్లిదండ్రుల్ని బస్సెక్కించి వూరికి పంపేసింది.

ఆఫీసుకి వెళ్ళాక మరియమ్మ సీటు దగ్గరికి వచ్చి తను స్పీడుగా రికవరీ అయి ఆఫీసుకి వచ్చినందుకు సంతోషం వ్యక్తపరిచింది.

“ఆ హాస్పటల్ మన మేనేజర్‌గారి అల్లుడిదే. మనవాళ్ళంటే ఎంతో కేర్ తీసుకుని ట్రీట్‌మెంట్ ఇస్తారు. మేనేజర్‌గారు పంపారంటే వి.ఐ.పి ట్రీట్‌మెంటే” అంటోంది మరియమ్మ.

కిరణ్మయి కళ్ళముందు పాతికవేల రూపాయల బిల్లు కనిపిస్తోంది. ‘అల్లుడిగారి కోసమన్న మాట మామగారు ఎంతో కేర్ తీసుకుని అంబులెన్స్ తెప్పించి హాస్పిటల్‌కి పంపించేది’ అనుకుని పళ్ళు కొరుక్కుంది. ఇకముందు దగ్గు, పడిశం వంటి రుగ్మతలు వచ్చినా మేనేజర్‌కి తెలిస్తే ప్రమాదమన్న సత్యం బోధపడింది కిరణ్మయికి.